



EVENING EDITION
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
బుధవారం
25-02-2026
పేజీలు: 02




## నేను జోక్యం చేసుకోకపోతే.. 3.5 కోట్ల మంది చనిపోయేవారు

### డోనాల్డ్ ట్రంప్

భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని ఆపానని, దాంతో పాటు మొత్తం 8 యుద్ధాలను ఆపినట్లు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వెల్లడించారు. క్యాపిటల్ హిల్‌లో ఇవాళ ఆయన ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో ఒకవేళ అమెరికా జోక్యం చేసుకోకుంటే, అప్పుడు సుమారు మూడున్నర కోట్ల మంది మరణించేవారని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చెప్పినట్లు ట్రంప్ గుర్తు చేశారు. దేశంలోనే, ఇతర దేశాల్లో ఉన్న అమెరికా పౌరులకు రక్షణ కల్పిస్తున్నామని, దీని పట్ల గర్వపడుతున్నామని, గత పది నెలల్లో 8 యుద్ధాలను ఆపానని, పాకిస్థాన్.. భారత్ మధ్య అణ్వాయుధ యుద్ధం జరిగేందని ట్రంప్ తన ప్రసంగంలో వెల్లడించారు. నేను జోక్యం చేసుకోకుంటే 3.5 కోట్ల మంది ప్రజలు చనిపోయేవారని పాక్ ప్రధాని షెహబాజ్ చెప్పినట్లు ట్రంప్ తెలిపారు. 9వ యుద్ధాన్ని కూడా ఆపేందుకు తమ ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య భీకర మానవహననం జరుగుతోందని, ఒకవేళ తాను ప్రెసిడెంట్‌గా ఉండి ఉంటే, ఈ యుద్ధం జరిగేది కాదు అని ఆయన అన్నారు. భారత్, పాక్ మధ్య యుద్ధాన్ని ఆపినట్లు ఇప్పటికే 80 కన్నా ఎక్కువ సార్లు ట్రంప్ చెప్పారు. అయితే 200 శాతం ట్రేడ్ టారిఫ్ విధిస్తానని బెదిరించడం వల్ల ఆ రెండు దేశాలు యుద్ధాన్ని విరమించుకున్నట్లు గతంలో ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే.

### నాంపల్లి ఎగ్జిబిషన్‌లో 264 మంది పోకిరీలకు

## పోలీసుల ట్రీట్మెంట్

ఇటీవల హైదరాబాద్‌లోని నాంపల్లిలో జరిగిన నుమాయిష్ ఎగ్జిబిషన్‌లో 264 మంది పోకీరిలకు బుద్ధి చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు. వీరు ఎగ్జిబిషన్‌లో తిరుగుతూ మహిళలను వేధింపులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. వీరిలో 242 మంది మేజర్లు, 22 మంది మైనర్లు ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 56 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిని కోర్టులో ప్రవేశపెట్టగా 52 మందికి కోర్టు రూ.1050 జరిమానా విధించింది. నలుగురికి 2 రోజుల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించినట్లు తెలిపారు. మరో 188 మందికి పోలీసులు కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. అమ్మాయిల పట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు.

### చిన్నారి హత్య కేసులో సంచలనం..

## కన్నతల్లే హంతకురాలు!

తిరుపతిలో మూడేళ్ల చిన్నారి హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రియుడితో పెళ్లికి అడ్డుగా ఉందని కన్న తల్లే పాపను చంపేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. వివరాల్లోకి వెళ్తే.. తిరుపతి పోస్టల్ కాలనీకి చెందిన ఆశాలత (19)కు రాజేష్ అనే వ్యక్తితో నాలుతగేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమార్తె దుర్గ(3) ఉంది. ఆశాలత మనస్పర్థలతో తన భర్తతో విడిపోయి కూతురితో కలిసి పోస్టల్ కాలనీలో ఉంటోంది. ఈ క్రమంలో ఏర్పేడు మండలం చెన్నంపల్లికి చెందిన వ్యక్తితో తనకు పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఇద్దరూ కలిసి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. దీంతో ఆశాలత అడ్డుగా ఉన్న చిన్నారిని హత్య చేసి స్వర్ణముఖి నది సమీపంలో పూడ్చిపెట్టింది.



## జీహెచ్ఎంసీ దోమల ఫాగింగ్‌లో

# భారీ స్కాం

హైదరాబాద్‌లో భారీ స్కాం వెలుగులోకి వచ్చింది. దోమల నివారణకు ఫాగింగ్ చేసే వ్యవహారంలో భారీగా అవినీతి జరిగినట్లుగా తెలుస్తోంది. ఫాగింగ్ చేసే సిబ్బంది మధ్య పంపకాల్లో తేడాలు రావడంతో ఈ విషయం బయటపడింది. ప్రతి ఏటా దోమల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం రూ32 కోట్లు ఖర్చు చేస్తోంది. బల్దియా ఉన్నతాధికారుల దోమల ఫాగింగ్ కోసం మల్కాజిగిరి సర్కిల్‌కు రోజూ 84 లీటర్ల డీజిల్ కేటాయించారు. అయితే ఎంటమాలజీ సిబ్బంది 84 లీటర్లలో కేవలం 24 లీటర్ల డీజిల్ దోమల ఫాగింగ్ చేసి.. మిగతా డీజిల్‌ను పక్కదారి పట్టించారు. ఆ డీజిల్‌ను పెట్రోల్ బంక్‌కు రూ.10 కమీషన్ ద్వారా అమ్మి.. మిగతా డబ్బును తీసుకున్నారు. అలా వచ్చిన సొమ్ములో ఫాగింగ్ చేసే సిబ్బందికి ప్రతి నెల రూ.5 వేలు ఇచ్చి, మిగతా డబ్బులను సూపర్‌వైజర్, ఏఈ, ఎస్ఈ పంచుకునేవారు. పంపకాల్లో తేడా రావడంతో ఫాగింగ్ చేసే సిబ్బంది ఈ విషయాన్ని బయటపెట్టారు. దీంతో ఆ వర్కర్స్‌ను ఇతర సిబ్బంది, ఎంటమాలజీ అధికారులు బెదిరించారు. ఇదిలా ఉంటే ఎంటమాలజీలో డీజిల్ పక్కదారి పడుతుందున్న విషయం బయటకు రావడంతో.. గత మూడు నెలల నుంచి డీజిల్‌లో మెలాథిన్ అనే కెమికల్‌ను కలిపి ఇస్తున్నారు. దీంతో డీజిల్‌ను అమ్ముకునే ఛాన్స్ లేకుండా పోయింది. అయినప్పటికీ ఫాగింగ్ పని తప్పించుకోవడానికి ఆ డీజిల్‌ను సిబ్బంది డ్రైనేజీలో పారబోస్తున్నారు. ఇలా నిధులు పక్కదారి పట్టడంతో పాటు, సిబ్బంది సరిగ్గా పనిచేకపోవడంతో నగరవాసులకు దోమల బెడద తప్పడం లేదు. ఫాగింగ్ చేసే సిబ్బందికి ప్రతి నెలా 5 వేల రూపాయలు ఇచ్చి మిగతా డబ్బులు సూపర్ వైజర్, ఏఈ, ఎస్ఈ పంచుకున్నారు. సూపర్ వైజర్ ఫాగింగ్ సిబ్బందికి ఫోన్ పే ద్వారా డబ్బులు పంపారు. విషయం బయటకి తెలియడంతో ఉన్నతాధికారులు సూపర్ వైజర్‌ను తీసేశారు. పంపకాల్లో తేడా వచ్చి విషయం బయట పెట్టిన ఫాగింగ్ చేసే వర్కర్‌ను.. ఇతర సిబ్బంది, ఎంటమాలజీ అధికారులు బెదిరించారు. ఎంటమాలజీలో డీజిల్ పక్కదారి పడుతోందని తెలియడంతో.. అధికారులు గత మూడు నెలల నుంచి డీజిల్‌లో మెలాథిన్ కెమికల్‌ను కలిపి ఇస్తున్నారు. ఇప్పుడు డీజిల్ అమ్ముకునే ఛాన్స్ లేకపోవడంతో ఫాగింగ్ చేయకుండా పని తప్పించుకోవడానికి మెలాథిన్ కెమికల్ కలిపిన డీజిల్‌ను సిబ్బంది డ్రైనేజీలో పారబోస్తున్నారు. ఏటా రూ.32 కోట్లు ఖర్చు చేస్తున్నా.. నిధులు భారీగా పక్కదారి పడుతుండటంతో నగరవాసులకు దోమల బెడద తప్పటం లేదు.



## సుప్రీంకోర్టులో మల్లారెడ్డికి దక్కని ఊరట

సుప్రీంకోర్టులో తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత మల్లారెడ్డి, ఆయన కుమారుడు మహేందర్ రెడ్డి, అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డిలకు చుక్కెదురైంది. జీడిమెట్ల భూ సర్వేకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు అంగీకరించలేదు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలోని జీడిమెట్ల సర్వే నం. 82/1/ఈఈలో గల 0.33 గుంటల భూమికి హద్దులు నిర్ణయించాలని కోరుతూ శేరి శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి తొలుత హైకోర్టును ఆశ్రయించారు. తన భూమికి వెళ్లే దారిని మూసివేశారని, ఈ విషయంలో తహసీల్దార్ జారీ చేసిన లేఖను కూడా ఆయన తన పిటిషన్‌లో సవాల్ చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి, 45 రోజుల్లోగా సర్వే పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ తీర్పును మల్లారెడ్డి తదితరులు డివిజన్ బెంచ్‌లో సవాల్ చేయగా, సింగిల్ జడ్జి ఉత్తర్వులను ద్విసభ్య ధర్మాసనం సమర్థించింది. దీంతో వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై నిన్న జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్.వి. అంజరియాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. సర్వే ప్రక్రియ ఇప్పటికే పూర్తయినందున, ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేస్తూ పిటిషన్‌ను తోసిపుచ్చింది.



### కల్తీ పాల బాధితులపై నిర్లక్ష్యం..

## అధికారి సస్పెండ్

రాజమండ్రి ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. కల్తీ పాల బాధితులకు వైద్యం చేయడంలో నిర్లక్ష్యం వహించారని ఆయనపై ఆరోపణలు రావడంతో చర్యలు తీసుకున్నది. ఆయన స్థానంలో కెనడిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కల్తీ పాల ఎఫెక్ట్‌తో సుమారు 15 మంది రాజమండ్రి ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. రోజురోజుకీ వీరి ఆరోగ్యం క్షీణిస్తోంది. బాధితుల్లో ఎనిమిది మంది ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## ప్రముఖ యూట్యూబర్ కోమలి ఆత్మహత్య



సోషల్ మీడియా వేదికగా మంచి గుర్తింపు సంపాదించుకున్న ప్రముఖ యూట్యూబర్ కోమలి ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. మణికొండ చిత్రపురి కాలనీలో తన మామ ఇంట్లో ఉంటున్న ఆమె, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ప్రాణాలు తీసుకుంది. ఈ ఘటన కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులను తీవ్ర విషాదంలో ముంచేసింది. తెలంగాణలోని మల్లారెడ్డి విశ్వవిద్యాలయంలో విజ్ఞాన శాస్త్రం విభాగంలో చదువుతున్న కోమలి, చదువుతో పాటు యూట్యూబ్‌లో వీడియోలు చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. తక్కువ సమయంలోనే ఆమె తనకంటూ ప్రత్యేకమైన అభిమాన వర్గాన్ని సంపాదించుకుంది. ఆమె వీడియోలు యువతలో మంచి ఆదరణ పొందేవి. అయితే, కోమలి ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. గత మూడు సంవత్సరాలుగా మరో యూట్యూబర్‌తో ఆమె ప్రేమలో ఉన్నట్లు సమాచారం. అతను సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగం చేస్తూనే యూట్యూబ్‌లో కూడా వీడియోలు చేస్తుండేవాడు. కొంతకాలం సంతోషంగా సాగిన వారి ప్రేమలో విభేదాలు తలెత్తడంతో సుమారు ఏడాది క్రితం ఇద్దరూ విడిపోయినట్లు తెలుస్తోంది. ఈ విభేదాల కారణంగా కోమలి తీవ్ర మానసిక ఆందోళనకు గురైనట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కొన్ని నెలల క్రితమే ఆమె ఆత్మహత్యాయత్నం చేసినట్లు సమాచారం. ఆ సమయంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆమెను ఓదార్చి ధైర్యం చెప్పినప్పటికీ, ఈసారి తీవ్ర నిర్ణయం తీసుకోవడం అందరినీ కలచివేసింది.



## అదే నా డ్రీమ్ ప్రాజెక్ట్!

లాయర్ కావాలనుకొని నటిగా మారానని, తెలుగు సినిమాలకే తన తొలి ప్రాధాన్యం అని చెప్పింది కథానాయిక నయన్ సారిక. గం గం గణేశా, ఆయ్, క వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైందీ మరాఠీ భామ. ఆమె శ్రీవిష్ణు సరసన నటించిన తాజా చిత్రం 'విష్ణు విన్యాసం'. యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో సుమంత్ నాయుడు జి నిర్మించిన ఈ సినిమా.. ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా మంగళవారం నయన్ సారిక విలేకరులతో సినిమా విశేషాల్ని పంచుకుంది. ఈ సినిమాలో తన పాత్రపేరు మనీషా అని, కాలేజీ లెక్చరర్‌గా కనిపిస్తానని చెప్పింది.


## త్వరలో రాజకీయాల్లోకి వస్తా

### ఐపీఎస్ పీవీ సునీల్ కుమార్



సీనియర్ ఐపీఎస్ ఆఫీసర్, ఏపీ సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్ కుమార్ సంచలన ప్రకటన చేశారు. తాను త్వరలో ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానున్నట్లు తెలిపారు. తనను కొంతమంది కావాలనే టార్గెట్ చేసి వేధిస్తున్నారని ఆరోపించారు. ఏపీ పోలీసులు ఏదో ఒక కేసులో తనను అరెస్ట్ చేయాలని చూస్తున్నారని చెప్పారు. రఘురామ కృష్ణం రాజు కేసులో తాను సస్పెండ్ కాలేదని, విదేశాలకు వెళ్లినందుకు సస్పెండ్ చేశారని వెల్లడించారు. రఘురామను తాను వేధించలేదని స్పష్టం చేశారు. తప్పుడు ఆధారాలతో తనను కేసుల్లో ఇరికిస్తున్నారని, రఘురామ ఒత్తిడితోనే అధికారులు వేధిస్తున్నారని ఆరోపించారు. పీడిత జనాల కోసం రాజకీయాల్లోకి వస్తానని చెప్పారు. ఏ రాజకీయ పార్టీలో చేరబోనని, కాపులతో కలిసి అణగారిన వర్గాల కోసం పని చేస్తానని చెప్పారు.

## 'ది కేరళ స్టోరీ 2'కు కోర్ట్ షాక్




2023లో విడుదలైన 'ది కేరళ స్టోరీ' చిత్రం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. రెండేళ్ల విరామం తర్వాత దానికి సీక్వెల్‌గా 'ది కేరళ స్టోరీ 2' చిత్రాన్ని కామాఖ్య నారాయణ్‌సింగ్ రూపొందించారు. సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఈ నెల 27న విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. ఇటీవలే టీజర్‌ని రిలీజ్ చేశాయగా, అందులో చూపించిన అంశాలు వివాదాలకు దారితీశాయి. మత విద్వేషాలను రెచ్చగొట్టేలా సినిమా రూపొందించారంటూ కేరళ హైకోర్ట్‌లో ఈ సినిమాపై పిటీషన్ దాఖలైంది. మంగళవారం దీనిపై జరిగిన విచారణ అనంతరం కేరళ హైకోర్ట్ ఈ సినిమాపై కీలక వ్యాఖ్యలు చేసింది. 'సాధారణంగా భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ విషయంలో కోర్టు జోక్యం చేసుకోదు. కానీ ఈ సినిమా పేరులో 'కేరళ' అని రాష్ట్రం పేరును వాడారు. ఇది ఓ రాష్ట్ర ఆత్మాగౌరవానికి చెందిన విషయం కావడంతో విచారించక తప్పలేదు. సినిమాను వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందించామని చెబుతున్నందున, కేరళ ప్రజల భయాందోళనలను విస్మరించలేం. ఓ వర్గాన్ని కానీ.. ప్రాంతాన్ని కానీ కించపరిచేలా కళారూపాలు ఉండకూడదు. చట్టపరమైన నిబంధనల ప్రకారం అభ్యంతకరమైన దృశ్యాలు కానీ, మాటల కానీ చేర్చకూడదు. అందుకే.. ఈ సినిమాను పూర్తిగా చూడాలనుకుంటున్నాం. ఈ నెల 25న ఈ సినిమాను కోర్టులో ప్రదర్శించాలి. తర్వాతే విడుదలపై నిర్ణయం తీసుకోగలం' అని కోర్టు తెలిపింది.


02 EVENING EDITION
బుధవారం | 25 ఫిబ్రవరి 2026
www.suryaa.com 4PM

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# శిఖర్ ధావన్‌కు భారీ ఊరట

## రూ. 5.72 కోట్లు తిరిగి చెల్లించాలని మాజీ భార్యకు ఆదేశం

ఇటీవలే సోఫీ షైన్‌ను వివాహం చేసుకున్న గబ్బర్ టీమిండియా వెటరన్ ఓపెనర్ శిఖర్ ధావన్‌కు తన మాజీ భార్య ఐషా ముఖర్జీతో జరుగుతున్న న్యాయపోరాటంలో భారీ విజయం లభించింది. ఐషాకు గతంలో చెల్లించిన సుమారు రూ. 5.72 కోట్లను తిరిగి ధావన్‌కు అప్పగించాలని ఢిల్లీ ఫ్యామిలీ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. 2023లో విడాకులు పొందిన నాటి నుంచి న్యాయపరమైన వివాదాల్లో చిక్కుకున్న ధావన్‌కు ఈ తీర్పు పెద్ద ఊరటనిచ్చింది. ఈ వివాదం వెనుక ఆస్ట్రేలియా ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పు ఉంది. ఆస్ట్రేలియా పౌరసత్వం ఉన్న ఐషా ముఖర్జీ, అక్కడి కోర్టులో "ప్రాపర్టీ సెటిల్‌మెంట్" కోసం పిటిషన్ దాఖలు చేశారు. ఆ దేశ చట్టాల ప్రకారం విడాకుల తర్వాత భార్యాభర్తల మధ్య ఆస్తుల పంపిణీ జరగాలి. ఈ నిబంధన కింద ధావన్ తన మాజీ భార్యకు రూ. 5.72 కోట్లు బదిలీ చేయాల్సి వచ్చింది. అయితే,





ఆస్ట్రేలియా కోర్టు ఆదేశాలను ఢిల్లీ ఫ్యామిలీ కోర్టు సవాలు చేసింది. ఆస్ట్రేలియాలో ఉన్న "ప్రాపర్టీ సెటిల్‌మెంట్" అనే భావన భారత న్యాయ వ్యవస్థకు, ముఖ్యంగా హిందూ వివాహ చట్టానికి పూర్తిగా విరుద్ధమని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. భారత చట్టాల్లో ఇలాంటి ఆస్తి పంపిణీకి ఎలాంటి నిబంధనలు లేవని స్పష్టం చేశారు. ఈ కారణంగా ఆస్ట్రేలియా కోర్టు తీర్పు ఇక్కడ చెల్లదని పేర్కొంటూ, ఐషా ముఖర్జీ ఆ డబ్బును తిరిగి ధావన్‌కు చెల్లించాలని ఆదేశించారు. గతేడాది (2023) ఇదే కోర్టు, ఐషా ముఖర్జీ తనను మానసికంగా తీవ్ర వేదనకు గురిచేశారని నిర్ధారిస్తూ ధావన్‌కు విడాకులు మంజూరు చేసింది. ముఖ్యంగా వారి కుమారుడు జొరావర్‌ను ధావన్‌కు దూరం చేయడం వంటి చర్యలను కోర్టు తీవ్రంగా పరిగణించింది. ఒకవైపు న్యాయపోరాటంలో విజయం సాధిస్తూనే, మరోవైపు ధావన్ తన వ్యక్తిగత జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాడు. ఈ నెల 21న తన స్నేహితురాలు సోఫీ షైన్‌ను ఢిల్లీలో జరిగిన ఒక ప్రైవేట్ కార్యక్రమంలో వివాహం చేసుకున్నాడు. తన పెళ్లిపై మాజీ భార్య పేరిట వస్తున్న నకిలీ కోట్స్, క్లిక్‌బైట్ వార్తలను నమ్మవద్దని, సానుకూల దృక్పథంతో ఉండాలని అభిమానులను కోరాడు. తాజా కోర్టు తీర్పుతో గబ్బర్ తన కొత్త జీవితాన్ని ప్రారంభిస్తూ, పాత ఆర్థిక వివాదాలకు ముగింపు పలికినట్టయింది.

## ఏడుస్తూనే నిద్రపోయేదాన్ని!

'బాడీ షేమింగ్‌కు గురై తీవ్రమైన మానసిక వ్యధకు లోనైన సందర్భాలు నా జీవితంలో కోకొల్లలు' అని బాలీవుడ్ భామ మృణాళ్‌ఠాకూర్ అన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె తన శరీర బరువుపై ఎదుర్కొన్న ట్రోలింగ్ గురించి మాట్లాడారు. 'ఆ రోజులింకా నా కళ్లలో కదులుతూనే ఉన్నాయి. ఏడ్చీ ఏడ్చీ అలసిపోయి నిద్రపోయేదాన్ని. పొద్దున్నే లేచేసరికి కళ్లు ఉబ్బిపోయి ఉండేవి. నేను అప్పట్లో కాస్త బొద్దుగా ఉండేదాన్ని. దాంతో నా చుట్టూ ఉండేవారే నన్ను ట్రోల్ చేసేవారు. ఆ ట్రోలింగ్ ప్రభావంతో ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయేదాన్ని. అలాంటి సమయంలో అక్షయ్‌కుమార్ మాటలు నాలో మార్పుని తెచ్చాయి. 'ట్రోలింగ్ వినకుండా ముందుకు సాగాలి. పాత్ర కోసం సన్నగా మారాల్సివస్తే కచ్చితంగా మారాలి' అని ఆయన చెప్పిన ఆ మాటలు.







## భోగి ఫస్ట్ లుక్ రిలీజ్

టాలీవుడ్‌లో వరుస ప్రయోగాలు చేస్తూ ప్రేక్షకులని అలరిస్తున్న హీరో శర్వానంద్ నటిస్తున్న తాజా చిత్రం భోగి. ఈ సినిమా నుంచి అభిమానులు ఎంతగానో ఎదురు చూసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం ఈరోజు విడుదల చేసింది. గంగ అనే పాత్రలో శర్వానంద్ కనిపించిన తీరు ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. పోస్టర్‌లో శర్వానంద్ గుబురు మీసంతో, చేతిలో పదునైన ఆయుధంతో కనిపిస్తున్నాడు. అతని కళ్లలో కనిపించే తీవ్రత, బాడీలో ఉన్న రఫ్‌నెస్ సినిమా టోన్ ఎంత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందో సూచిస్తోంది. ఈ లుక్ చూస్తుంటే ఇది పూర్తిస్థాయి యాక్షన్ డ్రామాగా ఉండబోతుందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇక చిత్రబృందం భోగి విడుదల తేదీని కూడా అధికారికంగా ప్రకటించింది. ఆగస్టు 28, 2026న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్నట్టు ప్రకటించింది. అదే వారం ముందుగా నాని నటిస్తున్న ది ప్యారడైజ్ విడుదల కానుండటంతో బాక్సాఫీస్ వద్ద ఇద్దరు హీరోల మధ్య ఆసక్తికరమైన పోటీ నెలకొననుంది. రెండు భారీ చిత్రాలు వరుసగా విడుదలవుతుండటంతో ప్రేక్షకుల్లో ఉత్కంఠ పెరిగింది. ఇక ఈ చిత్రంలో శర్వానంద్ సరసన అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. అలాగే రోహిత్ పాఠక్ కీలక పాత్ర పోషిస్తున్నారు. విభిన్నమైన కథతో రూపొందుతున్న ఈ చిత్రంలో పాత్రల ప్రాధాన్యత ఎక్కువగా ఉండబోతుందని సమాచారం.



## ఇంటర్ పరీక్షలు ప్రారంభం

తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం 9 గంటలకు ఫస్టియర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. రేపట్నుంచి సెండియర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్ పరీక్షల కోసం రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 1495 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 9.97 లక్షల మంది పరీక్షలకు హాజరవుతున్నారు. ఇంటర్ పరీక్షలకు హాల్ టికెట్ ఉంటేనే అనుమతిస్తున్నారు. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లను పరీక్షకు అనుమతిస్తారు. హాల్‌టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినా ఎంట్రీ ఉంటుంది. ఒక్క హాల్‌టికెట్ వెంట ఉంటే సరిపోతుంది. ఎలాంటి గుర్తింపు పత్రాలు అవసరంలేదు.

**ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు.. పరీక్షకు అనుమతించని అధికారులు!**

తెలంగాణ వ్యాప్తంగా నేడు ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పలువురు విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోలేకపోయారు. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తామని అధికారులు ముందే చెప్పారు. అయితే విద్యార్థులు అంతకు మించి ఆలస్యంగా వచ్చారు. దీంతో అధికారులు జగిత్యాల, నిజామాబాద్ జిల్లా కేంద్రాల్లో ఇద్దరు విద్యార్థినులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు. దీంతో నిరాశతో గేటు బయటే ఆగిపోయారు. చాలాసేపు అధికారులను రిక్వెస్ట్ చేసుకున్నా లోపలికి రానివ్వలేదు. వచ్చే నెల 18వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 1495 పరీక్ష కేంద్రాల్లో 9.97 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు.

## వైసీపీ చేసిన తప్పులను వైఎస్సార్‌కు
# ఆపాదిస్తున్నారని షర్మిల మండిపాటు

ఏపీ అసెంబ్లీలో తిరుమల లడ్డూ కల్తీపై జరుగుతున్న చర్చ ఇప్పుడు వైఎస్ కుటుంబాన్ని రచ్చకీడ్చమే కాకుండా, రాజకీయంగా కొత్త మలుపులు తిరుగుతోంది. వైసీపీ చేసిన తప్పులను తన తండ్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఆపాదించడంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'అత్త మీద కోపం దుత్త మీద చూపినట్లు కూటమి ప్రభుత్వ తీరు ఉందని ఎద్దేవా చేస్తూ, అసెంబ్లీ రికార్డుల నుంచి వైఎస్సార్‌పై చేసిన వ్యాఖ్యలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ హయాంలో ఏడు కొండలను రెండు కొండలు చేయాలని చూశారన్న విమర్శలను షర్మిల గట్టిగా తిప్పికొట్టారు. జరిగిందంతా తప్పుడు ప్రచారమే. నాడు ప్రతిపక్ష నేతగా చంద్రబాబే బురద చల్లారు. వాస్తవానికి ఏడు కొండలు వెంకన్నవేనని 2007లో శాశ్వత జీవో ఇచ్చి చరిత్ర సృష్టించింది వైఎస్సార్ అని ఆమె గుర్తు చేశారు. తిరుమల క్షేత్రంలో అన్యమత ప్రచారాన్ని అడ్డుకోవడానికి జీవో 746,



747లను తీసుకొచ్చి కఠిన నిబంధనలు అమలు చేసిన ఘనత తన తండ్రిదేనని, లడ్డూకు 2009లో అంతర్జాతీయంగా పేటెంట్ రైట్స్ సాధించింది కూడా ఆయనేనని స్పష్టం చేశారు.వైసీపీ పాలనను, వైఎస్సార్ సంక్షేమ పాలనను ఒకటిగా చూడవద్దని షర్మిల హితవు పలికారు.వైసీపీ పాలన దోచుకుతినే పాలన అయితే, వైఎస్సార్ పాలన పేదల సంక్షేమ పాలన. వైసీపీలో అసలు వైఎస్సార్ లేనే లేడు అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజశేఖర్ రెడ్డి ముమ్మాటికీ కాంగ్రెస్ మనిషి అని, కడవరకు కాంగ్రెస్‌లోనే బతికిన ఆయనను వ్యక్తిగతంగా దూషించడం చంద్రబాబుకు భావ్యం కాదన్నారు. వేద పండితుల కోసం 'ఆయుష్మాన్ భవ', దళితుల కోసం 'దళిత గోవిందం' వంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్న మహానేతను దేవుడిగా కొలుస్తారని అన్నారు.

## మెహదీపట్నం, లంగర్ హౌస్, టోలిచౌకి ప్రాంతాల్లో
# పర్యటించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

జలమండలి.. బస్తీ బాట..!" కార్యక్రమం భాగంగా గోల్కొండ జోన్ పరిధిలోని నానల్ నగర్ చౌరస్తా వద్ద సీవరేజ్ మరమ్మత్తు పనులను ఎండీ అశోక్ రెడ్డి పరిశీలించారు. ఈ ప్రాంతంలో హోటళ్లు, వాణిజ్య సముదాయాలు ఘనపదార్థాలు సీవరేజ్ లైన్లలో వదలడంతో మ్యాన్ హోళ్ళు తరచూ పొంగడం జరుగుతుంది. దానివల్ల ట్రాఫిక్ ఆటంకం ఏర్పడుతుంది. ఎప్పటికప్పుడు డీ-సిల్టింగ్ పనులు చేపట్టినా.. శాశ్వత పరిష్కారం ఖచ్చితంగా గుర్తించలేకపోయారు. ఈ నేపథ్యంలో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి మంగళవారం ఆ ప్రాంతాన్ని సందర్శించి.. నానల్ నగర్ నుంచి మెహిదీపట్నం వైపుగా ఉన్న మ్యాన్ హోళ్ళను అధికారులతో కలిసి పరిశీలించారు. ఫుట్ పాత్ అనుకుని ఉన్న మాన్ హోళ్లలోకి అక్కడక్కడ చెట్ల వేర్లు చేరి సమస్య పెంచిందని గుర్తించారు. దీంతో తాత్కలిత చర్యగా చెట్ల వేర్లను తొలగించి ధ్వంసమైన మ్యాన్ హోళ్ళను పునర్నిర్మాణం చేయాలని సూచించారు. అలాగే శాశ్వత పరిష్కరానికి ఈ ప్రాంతాల్లోని సీవరేజ్ లైన్లను సమీపంలోని జోన్-3 ట్రంక్ మెయిన్ కు మళ్ళించడానికి.. ప్రాజెక్టు అధికారులతో సమన్వయం చేస్తూ సీవరేజ్ నెట్‌వర్క్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, సమీపంలోని హోటళ్లకు సిల్ట్ ఛాంబర్ నిర్మాణానికి నోటీసులు జారీ చేయాలని సూచించారు.




## లండన్‌లో 16 ఏళ్ల నాటి భారత రెస్టారెంట్ రంగ్రేజ్ మూసివేత

బ్రిటన్ రాజధాని లండన్‌లో 16 ఏళ్లుగా భారతీయ రుచులను అందిస్తున్న ప్రముఖ 'రంగ్రేజ్' రెస్టారెంట్ శాశ్వతంగా మూతపడనుంది. పెరిగిన నిర్వహణ ఖర్చులు, నిరంతర వేధింపులు, దాడులతో పాటు స్థానిక పోలీసుల నుంచి సరైన మద్దతు లేకపోవడమే ఇందుకు కారణమని యజమాని హర్మన్ సింగ్ కపూర్ ప్రకటించారు. వచ్చే నెలలో రెస్టారెంట్‌ను మూసివేయనున్నట్లు ఆయన సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.గత కొంతకాలంగా హర్మన్ సింగ్ ఖలిస్థాన్ వేర్పాటువాదానికి వ్యతిరేకంగా తన గళం వినిపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పాకిస్థానీల నుంచి తనకు, తన కుటుంబానికి ఆన్‌లైన్‌లో వేధింపులు, దాడులు పెరిగిపోయాయని ఆయన ఆరోపించారు.16 ఏళ్ల మరపురాని ప్రయాణం తర్వాత, వచ్చే నెలలో రంగ్రేజ్ రెస్టారెంట్‌ను మూసివేయాలని బాధతో నిర్ణయం తీసుకున్నాను. పెరిగిన ఖర్చులు, పాకిస్థానీల నుంచి దాడులు, పోలీసుల నుంచి సరైన మద్దతు లేకపోవడం వల్ల వ్యాపారాన్ని కొనసాగించడం అసాధ్యంగా మారింది అని హర్మన్ సింగ్ తన పోస్టులో పేర్కొన్నారు.రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, ఇకపై పూర్తిస్థాయిలో ఉద్యమకారుడిగా మారతానని స్పష్టం చేశారు. వేర్పాటువాదులు ఒకటి గుర్తుంచుకోవాలి. మీరు నా వ్యాపారాన్ని దెబ్బతీయగలరు కానీ, నా సంకల్పాన్ని కాదు. ఇకపై ఎలాంటి ఆటంకాలు లేకుండా వారిపై మరింత బలంగా పోరాడతాను అని ఆయన హెచ్చరించారు. గతంలో 2023లో కూడా ఖలిస్థాన్ మద్దతుదారుల నుంచి తనకు బెదిరింపులు వచ్చాయని, రెస్టారెంట్‌పై దాడి జరిగిందని హర్మన్ సింగ్ ఆరోపించారు.

## ఎలక్ట్రిక్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

ఏపీఎస్ఆర్టీసీ మహిళలకు మరో గుడ్‌న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలులో భాగంగా, తాజాగా ఎలక్ట్రిక్ బస్సుల్లోనూ ఈ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. పీఎం-ఈబస్ సేవ పథకం కింద కేంద్రం రాష్ట్రానికి 750 విద్యుత్ బస్సులను కేటాయించింది. వీటిలో విజయవాడకు 100 బస్సులు రానున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే విజయవంతంగా కొనసాగుతున్న 'స్త్రీశక్తి' పథకం కింద మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారు. అయితే, కొత్తగా వచ్చే ఈ ఎలక్ట్రిక్ బస్సుల్లోనూ ఈ పథకాన్ని అమలు చేయడం వల్ల మహిళా ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన, కాలుష్య రహిత ప్రయాణం అందుబాటులోకి రానుంది. ఈ నిర్ణయంతో దూరప్రాంతాలకు వెళ్లే మహిళలతో పాటు, నగరాల్లో నిత్యం ప్రయాణించే వారికి కూడా పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూరనుంది. ముఖ్యంగా విజయవాడ వంటి రద్దీ నగరాల్లో 100 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు రావడం వల్ల రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడనుంది.

